క్లుప్తంగా

మద్యం సీసాలు స్వాధీనం



స్వాధీనం చేసుకున్న మద్యం బాటిళ్లతో ఎస్సై గణేష్, సిబ్బంది

నెల్లిమర్ల రూరల్: మండలంలోని పారసాం గ్రామంలో నిర్వహిస్తున్న బెల్ట్‌షాపుపై ఎస్సై గణేష్ సిబ్బందితో కలిసి ఆదివారం దాడి చేయగా... 101 మద్యం సీసాలు పట్టుబడ్డాయి. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ.. తమకు అందిన ముందస్తు సమాచారం మేరకు దాడులు చేపట్టామన్నారు. నిందితుడిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు. గ్రామాల్లో మద్యం విక్రయాలు చేపడితే తమకు సమాచారం అందించాలని కోరారు. సమాచారం ఇచ్చిన వారి వివరాలు గోప్యంగా ఉంచుతామని చెప్పారు. కార్యక్రమంలో ఏఎస్సై సతీష్, సిబ్బంది పాల్గొన్నారు.

ఖాదర్‌బాబా దర్బార్‌లో ఇఫ్తార్ విందు



ఇఫ్తార్ విందు వడ్డిస్తున్న ఖలీల్‌బాబు

విజయనగరం టౌన్: రంజాన్ మాసం తొలి ఇఫ్తార్ విందును హజరత్ ఖాదర్‌వలీ బాబా దర్బార్ దర్గా ప్రాంగణంలో ఆదివారం రాత్రి నిర్వహించారు. దర్బార్ ముతవల్లి మొహమ్మద్ ఖలీలుల్లా షరీఫ్ తాజ్ ఖాదరీసాబిరీ (ఖలీల్ బాబు) ప్రేమతో ముస్లిం సోదరులతో పాటూ అందరినీ ఆహ్వానించి వారికి పోషక విలువలతో కూడిన సంతృప్తికరమైన విందు అందించారు. అధిక సంఖ్యలో ప్రజలు పాల్గొన్నారు.

అనధికార ప్రచారాలు తొలగించండి



ఇంటి ముందున్న గోడలపై అనధికారికంగా రాసిన ప్రచారాలు


విజయనగరం: నగర సుందరీకరణలో భాగంగా ప్రతిఒక్కరూ తమ ఇల్లు ముందు భాగంలో గుర్తు తెలియని, అనధికార వ్యక్తులు అంటించిన పోస్టర్లు, పేపర్లు ఇతర రాతలను స్వచ్ఛందంగా తొలగించుకోవాలని విజయనగరం నగర పాలక సంస్థ కమిషనర్ పల్లి నల్లనయ్య సూచించారు. ఏదో ఒక రోజున ఐదు నిమిషాల సమయాన్ని వెచ్చించి తమ తమ ఇళ్ల ముందు అనధికారికంగా ఉన్న బోర్డులు ఫ్లెక్సీలు, నో పార్కింగ్ బోర్డులు, రాతలు తొలగించుకుని నగర సుందరీకరణకు సహకరించాలని ఆదివారం ఒక ప్రకటనలో కోరారు.

పశువులకు వ్యాధి నిరోధక టీకాలు..

డెంకాడ: జాతీయ పశువ్యాధి నియంత్రణ కార్యక్రమంలో భాగంగా పశువులకు వ్యాధి నిరోధక టీకాలు వేస్తామని అక్కివరం పశువైద్యాధికారి శ్రీకాంత్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 30వ తేదీ వరకు కార్యక్రమాన్ని కొనసాగిస్తామని పేర్కొన్నారు. ఆవులు, గేదెలకు గాలి కుంటువ్యాధి నివారణ టీకాలు వేస్తామన్నారు. పెయ్యిలకు బ్రూసెల్లోసిస్ వ్యాధి నిరోధక టీకాలు వేస్తామని తెలిపారు. గ్రామల్లో జరిగే శిబిరాలను రైతులు వినియోగించుకోవాలని కోరారు.

ఒత్తిడిని జయించండి

- ఎస్టీ కమిషన్ రాష్ట్ర చైర్మన్ డీవీజీ శంకరరావు




విద్యార్థులతో మాట్లాడుతున్న ఎస్టీ కమిషన్ చైర్మన్ శంకరరావు

నెల్లిమర్ల: విద్యార్థులు ఒత్తిడిని జయించి పరీక్షలు ప్రశాంత వాతావరణంలో రాయాలని ఎస్టీ కమిషన్ రాష్ట్ర చైర్మన్ డాక్టర్ డీవీజీ శంకరరావు అన్నారు. ఆదివారం ఆయన స్థానిక గిరిజన ఆశ్రమ ఉన్నత పాఠశాలను సందర్శించి పాఠశాల పరిసరాలు, విద్యార్థుల ఆరోగ్యం, చదువు వివరాలపై ఆరా తీశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. 10వ తరగతి విద్యార్థులు క్రమశిక్షణ, ఏకాగ్రతతో చదవడం వల్ల ఒత్తిడికి దూరంగా ఉంటారని చెప్పారు. ఉపాధ్యాయులు, సిబ్బంది కూడా విద్యార్థుల చదువు, ఆరోగ్యంపై దృష్టి సారించాలని సూచించారు. కార్యక్రమంలో హెచ్ఎం కర్రి సూర్యనారాయణ, సిబ్బంది పాల్గొన్నారు.

అమ్మో సతివాడ జంక్షన్..!

- ఆర్అండ్‌బీ రహదారి ఆక్రమించి వ్యాపారాలు
- ఇబ్బందులు పడుతున్న ప్రయాణికులు
- మొద్దు నిద్రలో అధికార యంత్రాంగం



సతివాడ జంక్షన్ ఇరుకుగా మారడంతో రెండు వాహనాలు వెళ్లలేని దుస్థితి

నెల్లిమర్ల రూరల్: మండలంలోని సతివాడ జంక్షన్ అంటే ప్రజలు హడలెత్తిపోయే పరిస్థితి నెలకొంది. సుమారు 20 గ్రామాలకు సతివాడ కేంద్ర బిందువు కావడంతో నిత్యం ప్రయాణికులు, ప్రజలతో రద్దీగా ఉంటోంది. ఆయా గ్రామాల ప్రజలు ఏది కొనాలన్నా సతివాడ రావాల్సిందే. ప్రధానంగా సతివాడ జంక్షన్‌లో వ్యాపారులు ఆర్అండ్‌బీ రహదారిని ఆక్రమించి రహదారి పైకి తమ వ్యాపారాలను విస్తరించడంతో ఆ మార్గంలో ప్రయాణించేందుకు తీవ్ర అవస్థలు పడుతున్నామని ప్రయాణికులు ఆరోపిస్తున్నారు. రెండు జిల్లాలను కలిపే ప్రధాన రహదారి కావడంతో నిత్యం వేల సంఖ్యలో వాహనాలు ఆ మార్గంలో రాకపోకలు సాగిస్తుంటాయి. సతివాడ జంక్షన్‌లో పలువురు వ్యాపారులు రోడ్డును ఆక్రమించడంతో ఎదురెదురుగా రెండు వాహనాలు వెళ్లలేని పరిస్థితి నెలకొందని గ్రామస్తులే స్వయంగా చెబుతుండడం గమనార్హం. దీంతో ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం ఏర్పడుతోందని, ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందో తెలియని పరిస్థితి నెలకొందని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇటీవల కాలంలోనే ఆక్రమణలు పెరిగిపోయాయని ప్రజలు చెబుతున్నారు. వాస్తవానికి సతివాడ జంక్షన్‌లో పలు షాపులు చెరువును ఆక్రమించి ఏర్పాటు చేసినట్లు 13 ఏళ్ల కిందట రెవెన్యూ యంత్రాంగం గుర్తించింది. ఆక్రమణలో ఉన్న కొన్ని షాపులను అప్పట్లో గట్టి పోలీస్ బందోబస్తు నడుమ తొలగించారు. చివరి నిమిషంలో వ్యాపారస్తులు కోర్టును ఆశ్రయించడంతో ఆ ప్రక్రియ కాస్తా నిలిచిపోయింది. అయితే సమస్య కోర్టు పరిధిలో ఉన్నప్పటికీ గడిచిన ఆరు నెలల నుంచి ఆక్రమణలు విపరీతంగా పెరిగిపోయాయని స్థానికులు చెబుతున్నారు. జంక్షన్‌లో ఉన్న ఆర్టీసీ బస్టాప్‌ను సైతం పూర్తి స్థాయిలో మూసివేశారంటే ఏ విధంగా ఆక్రమణలు ఉన్నాయో ఇట్టే తెలుస్తోందని స్థానికులు చెబుతున్నారు. ఇంత జరుగుతున్నా అధికార యంత్రాంగం చూసీ చూడనట్లు వ్యవహరించడం పలు విమర్శలకు తావిస్తోంది. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి కనీసం ఆర్అండ్‌బీ రోడ్డుపై ఇటీవల కాలంలో ఏర్పడిన ఆక్రమణలైనా తొలగించి తమకు విముక్తి కల్పించాలని ప్రయాణికులు, ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

ఎల్లమ్మ సిరుల మహోత్సవానికి సర్వం సిద్ధం



వివరాలు వెల్లడిస్తున్న ఎల్లమ్మ తల్లి సిరిమాను అధిరోహకుడు చందక త్రినాథ్, తదితరులు

విజయనగరం టౌన్: ఎల్లమ్మ తల్లి మహోత్సవాలకు సర్వం సిద్ధం చేసినట్లు సిరిమాను అధిరోహకులు చందక త్రినాథ్ తేజ తెలిపారు. ఆదివారం స్థానిక జొన్నగుడ్డిలో వెలిసిన ఎల్లమ్మ తల్లి వనంగుడి వద్ద అలయ కమిటీ సభ్యులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మార్చి ఆరో తేదీన ఎల్లమ్మ తల్లి తొలేళ్ల మహోత్సవం, ఏడో తేదీన సిరిమాను ఉత్సవం నిర్వహిస్తామన్నారు. ఏడో తేదీన జొన్నగుడ్డి వనంగుడి నుంచి ఊరేగింపుగా సంగీత కళాశాల వద్దనున్న ఎల్లమ్మ తల్లి గుడివద్దకు చేరుకుని ప్రత్యేక పూజలు చేస్తామని చెప్పారు. ఎల్లమ్మ తల్లి ఉత్సవాలను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో వార్డు పెద్దలు దుప్పాడ అప్పారావు, చందక సూకరాజు, రామ పైడి, లోగిశ రామకృష్ణ, మద్దిల సోంబాబు, తదితరులు పాల్గొన్నారు.

రోజుకు రూ.కోటి పన్ను వసూలు

- నగర పాలక సంస్థ కమిషనర్ నల్లనయ్య

విజయనగరం: ప్రతిరోజూ కోటి రూపాయలు పన్ను వసూలే లక్ష్యంగా ప్రత్యేక కార్యాచరణ రూపొందించామని విజయనగరం నగర పాలక సంస్థ కమిషనర్ పల్లి నల్లనయ్య స్పష్టం చేశారు. ఈ మేరకు పన్ను వసూళ్లకు ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన బృందాలతో ఆదివారం అన్ని ప్రాంతాల్లో పర్యటించి పన్ను వసూలు చేశారు. సహాయ కమిషనర్ కె.అప్పలరాజు ఆధ్వర్యంలో రెవెన్యూ సిబ్బంది, కార్యదర్శులు మొండి బకాయిదారులను కలవగా.. కొంత మంది అక్కడికక్కడే పన్ను చెల్లించారు. మరి కొంతమంది ఆన్‌లైన్ ద్వారా చెల్లించారు. అనంతరం కమిషనర్ పల్లి నల్లనయ్య మాట్లాడుతూ.. పన్ను వసూళ్లను వేగవంతం చేసేందుకు ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేశామన్నారు. పన్ను బకాయిలు చెల్లించని వారి దుకాణాలను మూసివేస్తామని చెప్పారు. గృహాలకైతే నీటి సరఫరా, విద్యుత్ కనెక్షన్లు తొలగిస్తున్నట్లు తెలిపారు. ప్రజలందరూ ఆస్తి, ఖాళీ స్థలాలు, కుళాయి పన్నులు త్వరితగతిన చెల్లించి నగర అభివృద్ధికి సహకరించాలని కోరారు.

పోరాటం ద్వారానే మహిళలకు సమాన హక్కులు

- యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి విజయగౌరి



మాట్లాడుతున్న యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి విజయగౌరి

విజయనగరం గంటస్తంభం: పోరాటం ద్వారానే మహిళలకు సమాన హక్కులు సిద్ధిస్తాయని యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి విజయగౌరి అన్నారు. ఈ నెల 8వ తేదీన అంతర్జాతీయ మహిళా దినోత్సవం నేపథ్యంలో ప్రజా సంఘాల ఆధ్వర్యంలో ఆదివారం భారీ ర్యాలీ నిర్వహించారు. అనంతరం శ్రామిక మహిళా జిల్లా కన్వీనర్ వి. లక్ష్మి అధ్యక్షతన జరిగిన సదస్సులో విజయగౌరి మాట్లాడుతూ.. అనేక మంది మహిళల పోరాట ఫలితమే అంతర్జాతీయ మహిళా దినోత్సవమని చెప్పారు. 1857లో న్యూయార్క్ నగరంలోని ఓ బట్టల మిల్లులో పనిచేస్తున్న మహిళా కార్మికులు సమస్యలపై పోరాటం చేయడంతో 146 మంది మృత్యువాత పడ్డారన్నారు. దీంతో ప్రపంచ వ్యాప్తంగా కార్మికులందరూ ఐకమత్యం కావడంతో కంపెనీలు దిగి వచ్చాయని చెప్పారు. ఈ నేపథ్యంలో మార్చి 8న అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని మహిళలు హక్కులు దినంగా జరపాలని ఐక్యరాజ్య సమితి 1977లో ప్రకటించిందని తెలిపారు. సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పు ప్రకారం కనీస వేతనాలు అమలు చేయకపోవడంతో మహిళా కార్మికులు కుటుంబాలను నెట్టుకు రావడానికి ఇబ్బంది పడుతున్నారన్నారు. మహిళలకు అండగా ఎన్ని చట్టాలు చేసినా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వాటిని అమలు చేయడంలో విఫలమవుతున్నాయని ఆరోపించారు. రాష్ట్ర ప్రభుత్వం మొన్న పెట్టిన బడ్జెట్‌లో కూడా మహిళలకి సంబంధించిన నిధులు పెంచకపోవడంతో మహిళలు అన్ని రకాలుగా నష్టపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ రాష్ట్ర ఉపాధ్యక్షురాలు ఎం. ఉమా మహేశ్వరి మాట్లాడుతూ.. చట్టసభల్లో 33 శాతం రిజర్వేషన్ మహిళలకు అమలు చేస్తామని మోదీ ప్రభుత్వం హామీ ఇచ్చినా నెరవేరలేదన్నారు. కార్యక్రమంలో ఐద్వా జిల్లా కార్యదర్శి పి రమణమ్మ, సమతా రాష్ట్ర కన్వీనర్ జి. నిర్మల, అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్. అనసూయమ్మ, ఎస్ఎఫ్ఐ జిల్లా కన్వీనర్ ఎస్. సమీర, బి పైడిరాజు, కె. ప్రభ, కుమారి, సీహెచ్ రూప, సుభాషిని, హైమా, వేగోటి లక్ష్మి, శిరీష, తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్ర బడ్జెట్‌లో అంకెలెక్కువ.. సంక్షేమం తక్కువ..

- డీబీఎస్‌యూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చిట్టిబాబు



మాట్లాడుతున్న డీబీఎస్‌యూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చిట్టిబాబు

విజయనగరం టౌన్: రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన బడ్జెట్‌లో అంకె లెక్కువ... సంక్షేమం తక్కువని దళిత బహుజన శ్రామిక్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పి. చిట్టిబాబు ఆరోపించారు. ఆదివారం స్థానిక కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ.. ఎస్సీ, ఎస్టీ సబ్‌ప్లాన్ చట్ట ప్రకారం బడ్జెట్‌లో నిధుల కేటాయింపులు లేవన్నారు. నీతి అయోగ్ ఆదేశాలకు తిలోదకాలిచ్చారని మండిపడ్డారు. బడ్జెట్ దళిత ఆదివాసీలకు తీవ్ర నిరాశ మిగిల్చిందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం వెంటనే స్పందించి బడ్జెట్‌పై జరిగే చర్చలో దళిత ఆదివాసీలకు సామాజిక, ఆర్థిక అభివృద్ధి జరిగేలా నిధులు కేటాయించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో శ్రామిక మహిళా జిల్లా కోఆర్డినేటర్ కోరుకొండ వరలక్ష్మి, ఎస్సీ, ఎస్టీ ఎంప్లాయీస్ అసోసియేషన్ నాయకులు సూర్యచంద్ర, యూనియన్ నాయకులు బెల్లాన రమ్య, కార్తీక్, తదితరులు పాల్గొన్నారు.

ఉచిత బస్సు... అంతా తుస్సు

- అటకెక్కిన మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం పథకం హామీ
- పథకానికి బడ్జెట్‌లో ఒక్క రూపాయి కూడా కేటాయించని ప్రభుత్వం
- కూటమి ప్రభుత్వ తీరుపై మండిపడుతున్న మహిళలు



చీపురుపల్లి నియోజకవర్గంలో మహిళా ఓటర్ల వివరాలు...

మండలం	మహిళా ఓటర్లు
మెరకముడిదాం	23,315
చీపురుపల్లి	24,619
గరివిడి	28,179
గుర్ల	26,734

మెరకముడిదాం: అధికారం కోసం ఇష్టారీతిగా హామీలు ఇవ్వడం, ప్రజలను ప్రలోభ పెట్టడం...అధికారంలోకి వచ్చాక ఆ హామీలతో తనకేంటి సంబంధం అన్న ట్లు వాటిని అటకెక్కించడం సీఎం నారా చంద్ర బాబునాయుడు వెన్నతో పెట్టిన విద్య. 2014లో ప్రజలకు 600కు పైగా హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చిన చంద్రబాబు వాటిని అమలు చేయకుండా అన్ని వర్గాల ప్రజలను మోసం చేశారు. మళ్లీ 2024 లోనూ అదేరీతిగా సూపర్ సిక్స్‌తో పాటు అనేక హామీలు ఇచ్చా రు. ప్రధానంగా మహిళా ఓటర్లను ఆకట్టుకునేందుకు సూపర్ సిక్స్‌లో ఆడబిడ్డ నిధి, ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణం, దీపం పథకం (ఉచిత గ్యాస్ సిలిండర్లు), తల్లికివందనం వంటి పథకాలను చేర్చారు. కూటమి అధికారంలోకి వచ్చి 9 నెలలు గడిచిపోయింది. ఇప్పటి వరకు ఈ పథకాల్లో ఏవీ అమలు చేయలేదు. ఉచిత గ్యాస్ సిలిండర్ల పథకం ప్రారం భించేశామని ప్రభుత్వం చెప్పుకోవడానికే తప్ప క్షేత్రస్థాయిలో ఈ పథకం అమల్లో ఉందో లేదో పాలకులకే తెలియాలి. ఆడబిడ్డ నిధి కింద 18 ఏళ్లు నిండిన మహిళలందరికీ నెలకు రూ.1500 ఇస్తామని, మహి ళలు ఆర్టీసీ బస్సుల్లో టిక్కెట్ తియ్యకుండానే ఎక్కడికైనా ప్రయాణించవచ్చని ఎన్నికల సమయంలో చంద్రబాబుతో పాటు కూటమి నాయకులు ఊదరగొట్టారు. అయితే తాజాగా ప్రభుత్వం ప్రవేశపెట్టి న 2025- 2026 వార్షిక బడ్జెట్‌లో ఉచిత బస్సు ప్రయాణం, ఆడబిడ్డ నిధి పథకాలకు పూర్తిగా మొండి చెయ్యి చూపారు. తల్లికి వందనం, దీపం పథకానికి కూడా పూర్తి స్థాయిలో నిధులు కేటాయిం చలేదు. ఉచి త బస్సు ప్రయాణం, ఆడబిడ్డ నిధి పథకాలకు రూపాయి కూడా కేటాయించకుండా తమకు ఈ పథకాలు అమలు చేసే ఉద్దేశం లేదని ప్రభుత్వం చెప్పకనే చెప్పినట్లుందని మహిళలు మండిపడుతున్నారు.

ఇంకెప్పుడు అమలు చేస్తారు..?



ఉచిత బస్సు, ఆడబిడ్డ నిధి పథకాలకు ప్రభుత్వం బడ్జెట్‌లో ఒక్క రూపాయి కూడా కేటాయించలేదు. ఈపథకాలను ఇంకెప్పుడు అమలు చేస్తారో ప్రభుత్వ పెద్దలు చెప్పాలి. అధికారం కోసం ఇష్టారీతిగా హామీలు ఇవ్వడం, ఆతర్వాత వాటిని అటకెక్కించడం సరికాదు. ఏ పథకానికి ఎంత ఖర్చు అవుతుందన్న సంగతి ఎన్నికల్లో హామీ ఇచ్చినప్పుడు చంద్రబాబుకు తెలియదా..?. అధికారం వచ్చిన తర్వాత రాష్ట్ర ఆర్థిక పరిస్థితి బాగోలేదని కుంటిసాకులు చెప్పడం సిగ్గుచేటు. కూటమి ప్రభుత్వం మహిళలను మోసం చేసింది.

– బూర్లె పార్వతి, కొర్లాం గ్రామ సర్పంచ్, మెరకముడిదాం మండలం

అధ్యయనం చేశారా...?

కూటమి అధికారంలోకి వచ్చిన తర్వాత ఉచిత బస్సు ప్రయాణం పథకాన్ని ఇదిగో రేపే ప్రారంభించేస్తామన్నట్లు మీడియా ద్వారా తరచూ లీకులు ఇచ్చేది. ఒక్కో మంత్రి ఒక్కో ముహూర్తం తేదీని ప్రకటించేశారు. ఒకరు 2024 ఆగస్టు 15న ప్రారంభించేస్తామని చెబితే, మరికొందరు మంత్రులు దసరా,దీపావళి, సంక్రాంతి అంటూ తేదీలు మార్చుతూ వచ్చారు. ఆఖరికి ఈ పథకం అమలు కోసం ప్రభుత్వం మంత్రివర్గ ఉపసంఘాన్ని నియమించింది. రవాణాశాఖ మంత్రి చైర్మన్‌గా, మహిళా శిశు సంక్షేమశాఖ మంత్రి, హోంమంత్రి సభ్యులుగా సబ్ కమిటీ ఏర్పాటైంది. వీరు ఉచిత బస్సు ప్రయాణం పథకం అమలవుతున్న తెలంగాణ, కర్ణాటక, తమిళనాడు, పంజాబ్, ఢిల్లీ రాష్ట్రాల్లో పర్యటించి పథకం అమలుపై అధ్యయనం చేసి నివేదిక ఇవ్వాలని ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. అయితే ఈ కమిటీ అధ్యయనం చేసిందో లేదో ప్రభుత్వమే చెప్పా లి. చీపురుపల్లి నియోజకవర్గంలో 1,02,847 మంది మహిళా ఓటర్లు ఉన్నారు. వీరంతా ఉచిత బస్సు ప్రయాణం పథకాన్ని ప్రభుత్వం ఎప్పుడు అమలు చేస్తుందా అని ఎదురు చూస్తున్నారు.

ఆర్థిక సాయం..



ఇటీవల భోగాపురం మండలంలోని రాజాపులోవ గ్రామంలో జరిగిన అగ్ని ప్రమాదంలో జంకాల అప్పన్నకు చెందిన పూరిల్లు పూర్తిగా కాలిపోయింది. దీంతో ఎమ్మెల్యే లోకం నాగమాధవి ఆదేశాల మేరకు జనసేన పార్టీ మండల అధ్యక్షుడు వందనాల రమణ ఆదివారం గ్రామానికి వెళ్లి బాధిత కుటుంబ సభ్యులకు రూ. పది వేల నగదుతో పాటు నిత్యావసర సరుకులు అందజేశారు. కార్యక్రమంలో కమ్యూనిటీ హెల్త్‌సెంటర్ కమిటీ సభ్యులు బొల్లు త్రినాథ్, రాధాకృష్ణ రెడ్డి, నాయకులు లంక సత్యనారాయణ, మాత నవీన్, రాంబాబు, దాలి రెడ్డి, షణ్ముఖ సంతోష్, పండు, రమేష్, లక్ష్మణ్, తదితరులు పాల్గొన్నారు.

– భోగాపురం

వైద్య శిబిరం



విజయనగరం ఉడా కాలనీ ఫేజ్-3 పార్కులో ఈవినింగ్ వాకర్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఆదివారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. గుండె వైద్య నిపుణుడు నృషేన్ ఆదిత్య పాల్గొని గుండె సంబంధిత వ్యాధులు, బీపీ, సుగర్ పరీక్షలు చేపట్టి, అవసరమైన వారికి మందులు అందజేశారు. కార్యక్రమంలో ఈవినింగ్ వాకర్స్ క్లబ్ ప్రెసిడెంట్ జామి అప్పలసూరి, సెక్రెటరీ టి.చిన్నారావు, కోశాధికారి కె.ఆదినారాయణ, స్థానిక ప్రజలు, ఈవినింగ్ వాకర్స్ క్లబ్ సభ్యులు పాల్గొన్నారు.

– విజయనగరం

పుస్తకాల వితరణ



విజయనగరంలోని గాంధీపార్కులో ఉన్న వెన్‌లాక్ గ్రంథాలయానికి రీడ్స్ సంస్థ ప్రథమ వార్షికోత్సవం సందర్భంగా ఆదివారం పుస్తకాలు వితరణగా అందజేశారు. 200కు పైగా పుస్తకాలను గ్రంథాలయం ఇన్‌చార్జ్ వేణుగోపాల్‌కు అందించారు. కార్యక్రమంలో షేక్ గౌస్‌బాషా, చిన్నారులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

– విజయనగరం టౌన్

మద్యం మత్తులో పట్టుబడితే భారీ జరిమానా..

విజయనగరం క్రైమ్: మద్యం ద్వారా ఆదాయ మార్గాలను పెంచుకునేందుకు కూటమి ప్రభుత్వం ప్రయత్నాలు చేపడుతోంది. నిబంధనలు ఉల్లంఘించిన వాహన చోదకులకు భారీ జరిమానాలు వేసేందుకు రంగం సిద్ధం చేసింది. గతంలో మద్యం మత్తులో పట్టుబడిన వాహన చోదకులకు రూ. వంద నుంచి ఐదు వందల రూపాయల వరకు జరిమాన వేసేవారు. ఇకపై అలా పట్టుబడితే పది వేల రూపాయల జరిమాన, అవసరమైతే జైలుశిక్ష కూడా పడే అవకాశం ఉందని ఎస్పీ వకుల్ జిందల్ తెలిపారు. ఈ క్రమంలో ఎస్పీ వకుల్ జిందల్ ఆదేశాల మేరకు విజయనగరం ట్రాఫిక్ సీఐ సూరినాయుడు ఆధ్వర్యంలో ట్రాఫిక్ పోలీసులు ప్రత్యేక డ్రైవ్ చేపడుతున్నారు. ఇకపై మందుబాబులు బండి తీసేముందు ఆలోచించుకోవాల్సిందే.